# వడగాడుపు

"చెట్టు మీది పక్షీ! బయటకు వెళ్ళలేదేం?"

ఎండ!

"పంచ కింద కుక్కా! పడుకునే ఉన్నావేం?"

ఎండ!!

"ఏటిలోని నీటిపాయా! ఎండి పోయావేం?"

ఎండ!!!

★ ★ ★

కాలుస్తూన్న ఎండనూ, రివ్వున వీస్తున్న గాడుపునూ చీల్చుకుంటూ కొండల మధ్యనున్న ఆ గ్రామంలో మట్టి రోడ్డు మీద పోతోంది సైకిలు. ఆ వాహనం మీదున్నది ప్రైవేటు మెడికల్ ప్రాక్టీషనర్... రామం!

అతను కట్టిన చొక్కా, రామాయణ కాలందా? భారతం నాటిదా?... తొడిగిన జోడు ఆర్య సంస్కృతీ చిహ్నమా? ద్రావిడ నాగరికతా ఫలమా? పెట్టిన కళ్ళజోడు క్రీస్తు వాడినదా? అంతకు ముందుదా?

సుబ్బారావు వీధి గదిలో కూర్చునే ప్రశ్నలు వేసుకుంటూ; నిర్వ్యాపారస్తుల సద్వ్యాపార మయిన గోళ్ళను ఫలహారిస్తున్న సమయంలో... మండువాలోంచి గట్టిగా వినిపించింది.

"రామాన్నోసారిలా పిలవరా సుబ్బీ!"

"నిన్ను పుట్టించిన బ్రహ్మకీ ఎరుకగాదే నీ సంకల్పం! నేనేపాటి నాన్నా!" అనుకుంటూ వీధిలోకి లంఘించాడు సుబ్బారావ్.

"రామంగారోయ్!"

మలుపు తిరగబోతూన్న సైకిలు అసంకల్పిత ప్రతీకార చర్యగా ఆగింది.

"భగవంతుడా! ఒక్క యింజక్షను కేసు తగిలించు! పిల్లలయినా కడుపు నించుకుం టారు." - రామం మనసు ఆశగా వెనక్కి తిరిగింది. సుబ్బారావుని చూడగానే మరింత వినయంతో, ఆశతో సైకిలు నడిపించుకుంటూ వచ్చాడు.

"నాన్నగారు పిలిచారండి."

నీడ కోసం అటూ యిటూ చూసి చేసేది లేక సైకిల్ని అరుగుకి జారేసి మెట్లు ఎక్కి, గుమ్మం దగ్గరే జోళ్ళు విడిచి, మండువాలోకి అడుగుపెడుతూనే రెండు చేతులూ జోడించాడు రామం.

చేతులు పెట్టుకునే కర్రల మీదే కాళ్ళు పారేసి, ఎంతటి ధనవంతుడి కయినా కడుపులో చల్ల కదలకుండా ఎలా వుంటుందని ప్రశ్నిస్తున్న నున్నటి బొజ్జతో, ఎవరెవరికి ఏయే విధమైన వడ్డీ లెక్కలు ఎప్పుడు ఎలా చెప్పాలా అన్న ఆలోచనతో వేడెక్కి వేడెక్కి వెంట్రుకలు ఊడిపోయిన బట్టతలతో... నిదానంగానూ, ఆనందంగానూ పడక కుర్చీలో కూర్చున్న వరహాలరావు రామం నమస్కారం అందుకున్నాడు.

శరీరం కదలకుండానే పనికిరాని వాళ్ళను ఎలా బయటకు నెట్టడమో ఒంటబట్టించుకున్న అతగాడు; రెండు వేళ్ళనూ మూతి దగ్గరకు చేర్చుకుని నోట్లో ఉన్న తాంబూలం పిప్పిని కిటికీలోంచి బయటకు 'షూట్' చేసాడు.

"మంచినీళ్ళు పట్రావే!" హుకుం జారీచేసి రామం వైపు దృష్టి మరలించాడు.

"ఆ! ఏంటోయ్ విశేషాలు?"

చివుక్కుమన్లేదు రామం మనసు! ఆరు మైళ్ళ అవతల తన రాక కోసం, జేబు కోసం నోళ్ళు తెరుచుకు కూర్చున్న బిడ్డలనూ, భార్యనూ గుర్తు చేసుకోలేదు. నిన్న రాత్రి నుంచి కాళీగావున్న కడుపు యింకా కాళీగానే వుందని అనుకోలేదు.

"చిత్తం! ఏమన్నారండీ?"

అతని నవ్వులో వినయాలు... జీవితం అతని మీద సాధించిన విజయాలు.

మంచినీళ్ళను మోస్తున్న గ్లాసూ, ఆ గ్లాసును మోస్తున్న ఆసామీ వరహాలరావు ఆస్తిలో... అతని గౌరవాన్ని మోస్తున్న భాగం! ఆమె 'కర్మ' బాగుండటంవల్లో; రామం 'కర్మ' బాగోకపోవటం వల్లో... రామం దరిద్రాన్ని మోసే గాడిద కాలేక పోయింది. అదంతా రామానికాక్షణంలో గుర్తు రాలేదు.

గ్లాసు కింద పెట్టాడు. రివ్వున తిరుగుతున్న ఫాను, గాలిని కదిలిస్తోందేగాని చల్లబరచలేక పోతోంది.

"చూసావుటోయ్ రామం!"

"చిత్తం"

"కరంటేయించాక... నువ్విటీపు రాలేనట్టుందోయ్!"

ఆ మాత్రం చాలు అతనందుకోడానికి.

"చిత్తం! చిత్తం! ఫాను దివ్యంగా ఉందండి! గాలి మహా భేషుగ్గా వేస్తోందండి! ఏ కంపెనీయండీ!... ఏ - యస్. - హెచ్ - ఏ ఆ...షా! చాలా మంచి కంపెనీలెండి... వెధవది! ఆ కంపెనీ, యీ కంపెనీ... అని పరుగులు పెట్టడమేగానీండి... అబ్బే! ఏవీ లాభం లేదండి!... యీ మధ్య యింగిలీషు వాళ్ళు కూడా కొనుక్కుపోతున్నారుటండి! అయిదేళ్ళు... డోకా లేదండి... యింతకీ ఎంతక్కొన్నామన్నారన్నయ్యగారూ!"

తిరిగి వచ్చి కుర్చీ మీద కూర్చున్నాడు.

"ఆ! ఏమాత్రం, అయిదొందలు" ముసి ముసి నవ్వులతో నోరు చప్పరించేసాడు వరహాలరావు.

రెండొందల ఎనభయ్యో! మూడు వందలో! చచ్చి గీ పెట్టినా అంతకు మించదు. అయితేనేం...? రామం కర్తవ్యబంధితుడు.

"చిత్తం! తప్పకుండా ఉంటుందండి"

"మా చంటి వెధవ గోలెడుతుంటే రేడియో పుచ్చుకొన్నానోయ్! సుబ్బిగా! కాస్త దాన్ని మాట్టాడించరా!"

"చిత్తం! యీ వయసులోనే కదండీ పిల్లల సరదాలు... మహ చక్కగా మోగు..."

అదే వయసులోతండ్రి చచ్చి; అతని పుచ్చులన్నీ రామం మెడకు ఉచ్చులై సరదాలు సమాధులయాయి. మూలికలు నూరిన చేతులు అల్లోపతీ మందుల్తో ఊళ్ళ మీద పడ్డాయి. పెరుగుతున్న ధరల్తో...పెరుగుతున్న ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్లతో... పెరుగుతున్న పిల్లలతో.... వాళ్ళ సంఖ్యతో.... పోటీగా పెరగలేని రామం ఆదాయం.... కనీసావసరాలను కూడా తీర్చలేక పోతోంది.

రేడియోలో దెబ్బలాడుకున్న చిన్నక్కలూ, చిన్నన్నలూ పోయి హారతులు పాడే ముత్తైదువలు వచ్చేసారు.

వరహాలరావు ఉండుండి సెలవిస్తూనే ఉన్నాడు.

రామం యధాశక్తిలో 'చిత్తం' అంటూనే ఉన్నాడు. బోరు కొట్టిన గడియారం గంట కొట్టింది.

"ఒంటిగంట...! పాపం! వెళ్ళాలి కాబోలు"

కాబోలేం? వెళ్ళితీరాలి... రామం మాత్రం తేల్చలేదు.

"చిత్తం"

"సర్లే! వెళ్ళిరావోయ్! అప్పుడప్పుడు కనిపిస్తూండు! మరీ నల్లపూసయి పోతున్నావ్....!"

"చిత్తం! తీరుబడి లేకండి! వస్తానండన్నయ్యగారూ!"

వీధిలోకి అడుగుపెట్టిన కాళ్ళు చుర్రుమన్నాయి. అటూ యిటూ చూసాడు.

"ఏంటయ్యా వెదుకుతున్నావ్...?"

"జో....ళ్ళు... యిక్కడే పెట్టానండి!"

"ఎంతపన్జేసావయ్యా వెఱ్ఱి బ్రాహ్మడా! వీధిలో వదిలేసుకుంటావా...! దిక్కుమాలిన కుక్కలు...కళ్ళు మూసి తెరిచేలోగా... మాయం జేసేస్తున్నాయి..మొన్నీమధ్య మా వియ్యంకు డొస్తే....కనపళ్ళేదా...! యింకెక్కడుంటాయిలే... వెళ్ళిరామరి!- యింతకీ బంగారం లాంటి జోళ్ళనుకో ఆయనవి...."

"వస్తానండి"

సైకిలు బరువుగా నడుస్తున్నట్టయి టైర్ల వయిపు చూసాడు. ప్రాణం ఉసూరుమంది.

"దిక్కుమాలిన ఎండలు! పంక్చర్లు కరిగి తగులడ్డాయి కాబోలు! శనిముండావుళ్ళో...

పంపేలేదు!" అనుకుంటూ నడవటం ప్రారంభించాడు.

రోళ్ళు బ్రద్దలుచేసే రోహిణీకార్తె ఎండ!

పైన నెత్తి.....లోపల కడుపూ...కింద కాళ్లూ ఒకేలా మాడుతున్నాయి.

భుజం మీది కండువాతీసి తలకు చుట్టాడు.

మైలు దూరం నడిచేసరికి కళ్ళు చీకట్లు క్రమ్ముతున్నట్లయింది.

అటూ యిటూ చూసాడు! కనుచూపుమేరలో తుమ్మ మొక్కలు అయినా లేవు!

ఎఱ్ఱటి బూడిద ఉండుండి వీస్తున్న గాలిలో సుడులు తిరుగుతూ కళ్లూ ముక్కూ ఏకం చేస్తోంది.

నిప్పుల్లోంచి నడక! నిప్పుల వర్షం! క్షణ క్షణానికీ హెచ్చుతున్న గాడుపు!!

పిడచగట్టుకుపోతున్న నాలిక!!!

దాహం! ధాహం!! ఎండ!!! గాడుపు! గాడుపు!! పగబట్టి చుట్టు ముట్టి అతన్ని లొంగదీసుకున్నాయి.

రామం కూలిపోయాడు...!

★ ★ ★

"వీధిలో ఉండాల్సిన జోడూ! టైరులో ఉండాల్సిన గాలీ! ఏమయ్యారు?"

"సుబ్బారావు సరదాకు బలయ్యాం!"

"సుబ్బారావూ! సుబ్బారావూ! ఎందుకా సరదా పుట్టింది?"

"అల్పాచమానానికి బయటకు వస్తే, ఏడిపించాలనిపించింది రామాన్ని...! జోళ్ళు దాచాను! గాలి విప్పేసాను."

"చూసావా! నీవల్లనే రామం చచిపోయాడు."

"అబ్బబ్బే! నాకేం తెలియదు."

"పళ్ళు పీకెయ్యగలం! నీవే కారణం! ఒప్పుకో!"

"ఏమో! మానాన్న నడగండి"

"వరాల్రావూ! వరాల్రావూ! రామం చావు క్కారణం...'

"ఏడ్చినట్టే ఉంది! అంత ఎండలో నా ఫానునూ, రేడియోనూ పొగడ్డాని కెవడు దొరుకుతాడు! అదీగాక నా యింటి ముందునించే వెళ్ళమని నేనేమయినా ఆర్డరేసానా?"

"కళ్ళు పొడిచేస్తాం! నువ్వూ నీ కొడుకే కారణం! ఒప్పేసుకోండి."

"ఏమో మరి! కొంతవరకూ అయుండొచ్చు..."

"చచ్చిన రామం! నీ చావుక్కారణం వీళ్ళే గదూ!"

"చిత్తం చిత్తం! కాదండి!"

"మరెవరు?"

"చిత్తం! అంతా నా కర్మండి."

*★ (స్వాతి మాసపత్రిక: సెప్టెంబర్ 1977) ★*